నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | వరంగల్, మంగళవారం 14 జనవరి 2025 | MAHABUBABAD

హైదరాబాద్ నుంచి బైక్‌పై నర్సింహులపేటకు వస్తున్న యువత

- పట్టణాల నుంచి సొంతూళ్లకు జనం
- ఊరూరా సంక్రాంతి సంబురం

పల్లెలకు పండుగ కళ

నర్సింహులపేట, జనవరి 14 : సంక్రాంతి పండుగ వేళ పట్టణాల నుంచి సొంతూళ్లకు వచ్చిన వారితో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఉద్యోగం, ఇతర పనుల కోసం హైదరాబాద్ సహా పలు పట్టణాల్లో ఉంటున్న ప్రజలు మూడు రోజుల నుంచి బస్సులు, కార్లు, బైక్‌లపై గ్రామాల బాట పట్టడంతో దారులన్నీ కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి జిల్లాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రైళ్లు, బస్సులు రద్దీ ఎక్కువగా ఉండడంతో యువకులు ద్విచక్ర వాహనాలపై సంబురంగా ఊళ్లకు చేరుకున్నారు. ఏడాదికి ఒక రోజు కుటుంబ సభ్యులందరం కలిసేందుకు ఉత్సాహంగా వచ్చి.. ఇంటిల్లిపాది సంతోషంగా గడుపుతున్నారు. అంతేగాక చిన్ననాటి స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంటపొలాల్లో కలియదిరిగి ఆటపాటల్లో మునిగితేలారు.

అందరం కలిసి పండగ చేసుకుంటం..

సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో కబడ్డీ, క్రికెట్‌తో పాటు ముగ్గుల పోటీలు నిర్వహిస్తాం. నేను కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్నా. సంక్రాంతి వచ్చిందంటే మా ఊరి యువకులమంతా కలుసుకుంటాం. మాది వ్యవసాయ కుటుంబం. కనుమ రోజు పశువుల పండుగ సందర్భంగా పొలం వద్ద అందరం కలిసి పండుగ చేసుకుంటాం. అక్కడే భోజనాలు చేస్తాం.

– దాసరి రాజేశ్, నర్సింహులపేట